ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -140 పేజీలు - 04 వెల - 04/- శనివారం 27 జూన్ 2026

# డిజిటల్ పురోగతితో ఆర్థిక సాధికారత



**ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ పురోగతి**

**ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ విప్లవం**

**ప్రజల జీవన ప్రమాణాల పెంపు**

**ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వెల్లడి**

**నెదర్లాండ్స్ క్వీన్ మాక్సిమాతో భేటీ**

**డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై చర్చ**

**న్యూఢిల్లీ,జూన్ 26 ఆంధ్ర ప్రగతి :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ప్రత్యేక ప్రతినిధి (ఫైనాన్షియల్ హెల్త్), నెదర్లాండ్స్ రాణి అయిన క్వీన్ మాక్సిమా గురువారం న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. వీరిద్దరి మధ్య జరిగిన ఈ కీలక భేటీలో, భారతదేశంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా ఆర్థిక సేవలు **మిగతా 2లో...**

# ప్రజా సేవలు మరింత చేరువ




## ఆధార్ నంబర్‌తోనే అన్ని సర్టిఫికెట్ల డిజిటల్ వెరిఫికేషన్

**ఆధార్ నంబర్ కొడితే చాలు.. అన్ని వివరాలు రావాలి: మంత్రి నారా లోకేశ్**


**ఆర్టీజీఎస్ సేవలపై మంత్రి నారా లోకేశ్ ఉన్నతస్థాయి సమీక్ష**

**మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన**

**కుల, ఆదాయ ధృవపత్రాల జారీ ప్రక్రియ మరింత సులభతరం**

**డేటా లేక్ ద్వారా ప్రభుత్వ శాఖల సమాచారం అనుసంధానం**

**ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పటిష్ఠ చర్యలకు ఆదేశం**



**అమరావతిజూన్ 26 ఆంధ్ర ప్రగతి :** కేవలం ఆధార్ నంబర్ ఎంటర్ చేయగానే, ఒక అభ్యర్థికి సంబంధించిన అన్ని రకాల విద్య, క్రీడా సర్టిఫికెట్లు డిజిటల్‌గా వెరిఫై అయ్యే పారదర్శకమైన, పటిష్ఠమైన వ్యవస్థను తక్షణమే ఏర్పాటు చేయాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. దీనివల్ల ధృవపత్రాల పరిశీలన ప్రక్రియ సులభతరం అవ్వడమే కాకుండా, రాబోయే వేలాది ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో లక్షలాది మంది అభ్యర్థులకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థి ఆధార్ నంబర్ కొట్టగానే, ఆ సర్టిఫికెట్‌ను ఏ సంస్థ, ఎప్పుడు, ఎవరు జారీ చేశారనే వివరాలు రియల్ టైమ్‌లో తెలిసేలా 'డిజి వెరిఫై' వ్యవస్థను తీర్చిదిద్దాలని సూచించారు. **మిగతా 2లో...**

# కొత్త కోర్కెలతో 'రొట్టెల పండుగ'

**నెల్లూరులో స్వర్ణాల చెరువు వద్ద చారిత్రక రొట్టెల పండుగ**

**మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే వేడుక**

**ఐదు రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు**

**20 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా**



**నెల్లూరుజూన్ 26 ఆంధ్ర ప్రగతి :** దేశవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన నెల్లూరు 'రొట్టెల పండుగ' (జూన్ 26) ఘనంగా ప్రారంభం కానుంది. అయితే, ఒక రోజు ముందు నుంచే భక్తుల కోలాహలం మొదలైంది. స్వర్ణాల చెరువు ఒడ్డున ఉన్న చారిత్రక బారాషహీద్ దర్గా వేదికగా ఐదు రోజుల పాటు జరిగే ఈ వార్షిక మహోత్సవానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతో పాటు దేశ విదేశాల నుంచి సైతం లక్షలాదిగా తరలివస్తున్నారు. దీంతో స్వర్ణాల చెరువు కళకళలాడుతోంది. **మిగతా 2లో...**

# రాహుల్ గాంధీపై 'మిస్సింగ్' పోస్టర్లు...

**రాహుల్ విదేశీ పర్యటనలే లక్ష్యంగా బీజేపీ విమర్శలు**

**'లాపతా రాహుల్' పేరుతో సామాజిక మాధ్యమాల్లో పోస్టర్లతో క్యాంపెయిన్**

**రాహుల్ ప్రపంచస్థాయి నాయకుడని కాంగ్రెస్ కౌంటర్**

**బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం**

**న్యూఢిల్లీ,జూన్ 26 ఆంధ్ర ప్రగతి :** ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తరచూ చేపడుతున్న విదేశీ పర్యటనలను లక్ష్యంగా చేసుకుని బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. ఈ మేరకు 'మిస్సింగ్ రాహుల్ (లాపతా రాహుల్)' పేరుతో సరికొత్త పోస్టర్ ప్రచారాన్ని ప్రారంభించింది. ఆయన పర్యటనల కోసం చేస్తున్న ఖర్చులపై ప్రశ్నలు **మిగతా 2లో...**



# ఆపరేషన్ సిందూర్ లో ఆరుగురు అమరులు

**ఏడాది తర్వాత జవాన్ల పేర్లు ప్రకటించిన కేంద్రం**

**నేషనల్ వార్ మెమోరియల్ వెబ్‌సైట్‌లో**

**'రోల్ ఆఫ్ ఆనర్-2025'లో చోటు**

**తెలుగు అగ్నివీర్ మురళీ నాయక్ సహా**

**ఆరుగురికి దేశం నివాళి**

**న్యూఢిల్లీ,జూన్ 26 ఆంధ్ర ప్రగతి :** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఆరుగురు అమరవీరుల పేర్లను కేంద్ర ప్రభుత్వం తొలిసారి అధికారికంగా వెల్లడించింది. దేశ రక్షణలో అసమాన **మిగతా 2లో...**




# తాడిపత్రిలో మళ్లీ ఉద్రిక్తత..

## పెద్దారెడ్డి గృహనిర్బంధం

**గాంధీ విగ్రహం వద్ద దీక్ష చేపడతామన్న పెద్దారెడ్డి వర్గీయులు**

**వైసీపీ దీక్షను అడ్డుకుంటామన్న జేసీ వర్గీయులు**

**తాడిపత్రిలో భారీగా మోహరించిన పోలీసులు**






# పంచాయతీరాజ్ శాఖలో ప్రమోషన్ల పండగ..

**42 మంది ఎంపీడీవోలకు డీడీవోలుగా పదోన్నతులు**

**కూటమి ప్రభుత్వం వచ్చాక 10 వేల మందికి ప్రమోషన్లు**

**వర్షాకాలంపై అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష**

**సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశం**

**అమరావతిజూన్ 26 ఆంధ్ర ప్రగతి :** ఏపీ డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆ శాఖ అధికారులకు మరో తీపికబురు అందించారు. తాజాగా 42 మంది మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు (ఎంపీడీవోలు), డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లుగా (డీడీవోలు) పదోన్నతులు కల్పించే ప్రక్రియకు **మిగతా 2లో...**

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు

**సీఎం సలహాదారుడిగా రామకృష్ణారావు**

**మొత్తం 13 మంది ఐఏఎస్‌ల బదిలీ.. ఉత్తర్వులు జారీ**

**హైదరాబాద్‌జూన్ 26 ఆంధ్ర ప్రగతి :** రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి(సీఎస్)గా సీనియర్ ఐఏఎస్ సంజయ్ జాజు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సీఎస్‌గా ఉన్న కె.రామకృష్ణారావు **మిగతా 2లో...**



# దేశంలో 'ఈజీ కనెక్ట్' ప్రారంభం..

**ఇకపై బయలుదేరే ఎయిర్‌పోర్టులోనే అంతర్జాతీయ ప్రయాణ లాంఛనాలు**

**వారణాసి నుంచి తొలి 'ఈజీ కనెక్ట్' విమాన సర్వీస్ ప్రారంభం**

**టైర్-2, టైర్-3 నగరాల నుంచి అంతర్జాతీయ ప్రయాణాలు సులభతరం**

**న్యూఢిల్లీ,జూన్ 26 ఆంధ్ర ప్రగతి :** టైర్-2, టైర్-3 నగరాల నుంచి అంతర్జాతీయ ప్రయాణాలు చేసే వారికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. విదేశాలకు వెళ్లే ప్రయాణికుల కోసం నూతన విధానంలో భాగంగా 'ఈజీ కనెక్ట్' విమాన సేవలను ప్రారంభించింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి **మిగతా 2లో...**



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# తాడిపత్రిలో మళ్లీ ఉద్రిక్తత..

**తాడిపత్రి/అనంతపురంజూన్ 26 ఆంధ్ర ప్రగతి :**
అనంతపురం జిల్లా తాడిపత్రిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. టీడీపీ మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి, వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వర్గాలు పోటాపోటీగా నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అప్రమత్తమైన పోలీసులు శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్తగా పెద్దారెడ్డిని గృహనిర్బంధం చేశారు.
పూర్తి వివరాల్లోకి వెళితే... తాడిపత్రిలోని ప్రధాన కూడలి అయిన గాంధీ విగ్రహం వద్ద సామూహిక దీక్ష చేపడతామని పెద్దారెడ్డి వర్గీయులు ప్రకటించారు. అయితే, ఈ దీక్షను ఏమాత్రం సాగనివ్వబోమని, తాము అడ్డుకుంటామని జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గీయులైన టీడీపీ నేతలు స్పష్టం చేశారు. ఇదే సమయంలో జేసీ వర్గం మరో అడుగు ముందుకేసి.. అనంతపురంలో ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యేల ఇళ్ల ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు చేస్తామని ప్రకటించడంతో పరిస్థితి మరింత వేడెక్కింది.
జిల్లాలో ఒకవైపు మొహరం వేడుకలు, మరోవైపు వీవీఐపీల పర్యటనలు ఉండటంతో... ఇరువురు నేతల కార్యక్రమాలకు అదనపు రక్షణ కల్పించడం సాధ్యం కాదని పోలీసులు తేల్చి చెప్పారు. ఇరు వర్గాల నిరసనలకు అనుమతి నిరాకరించారు. ప్రజా శాంతికి సహకరించాలంటూ ఇరుపక్షాల నేతలకు ముందస్తుగా లీగల్ నోటీసులు జారీ చేశారు.ఇందులో భాగంగానే కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు ఆయన ఇంట్లోనే గృహ నిర్బంధం చేశారు. ఆయన నివాసం చుట్టూ, అలాగే తాడిపత్రిలోని గాంధీ సర్కిల్, సున్నితమైన ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తగా భారీగా పోలీసు బలగాలను మోహరించారు.

# పంచాయతీరాజ్ శాఖలో ప్రమోషన్ల పండగ..

**మొదటి పేజీ తరువాయి**
పచ్చజెండా ఊపారు. ఇందుకు సంబంధించిన సీనియారిటీ జాబితాను డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) ఆమోదించింది. దీంతో త్వరలోనే వీరందరూ ఉన్నత హోదాలో బాధ్యతలు చేపట్టనున్నారు.
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో పదోన్నతుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతోంది. ఇప్పటికే సుమారు 10 వేల మందికి పైగా సిబ్బందికి ప్రమోషన్లు కల్పించారు. గత పదేళ్లలో ఇంత భారీ సంఖ్యలో ఈ శాఖలో పదోన్నతులు ఇవ్వడం ఇదే ప్రథమమని అధికారులు చెబుతున్నారు.

**వర్షాకాలంపై కీలక సమీక్ష.. పవన్ కీలక ఆదేశాలు**
ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారులతో కీలక సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, కమిషనర్ కృష్ణ తేజతో మాట్లాడి, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.
"వర్షాకాలంలో నిలిచి ఉన్న నీటితో దోమలు పెరిగి, పైపులైన్ల లీకేజీల వల్ల తాగునీరు కలుషితమై ప్రజలు అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉంది. ప్రతి గ్రామ పంచాయతీ ప్రజారోగ్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలి. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి. అన్ని గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు అందుబాటులో ఉంచి, అవసరమైన చోట తక్షణం వినియోగించాలి" అని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.

# రాహుల్ గాంధీపై 'మిస్సింగ్' పోస్టర్లు

**మొదటి పేజీ తరువాయి**
సంధిస్తూ సామాజిక మాధ్యమాల్లో ఈ క్యాంపెయిన్‌ను ఉద్ధృతం చేసింది.
ఈ ప్రచారంలో భాగంగా పలు సినిమా పోస్టర్లను మార్ఫింగ్ చేస్తూ బీజేపీ నేతలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. "ఛడ్ దే ఇండియా", "రాహుల్ ఇన్ పారిస్", "పరదేశ్" వంటి పేర్లతో వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ప్రతిపక్ష నాయకుడి హోదాను 'పర్యటనల నేత'గా మార్చాలని కొందరు బీజేపీ అధికార ప్రతినిధులు ఎద్దేవా చేశారు. ఢిల్లీ బీజేపీ యూనిట్ "స్వదేశ్ వర్సెస్ పరదేశ్" పేరుతో పోస్టర్ విడుదల చేయగా, గోవా బీజేపీ రాహుల్ గాంధీ థాయ్‌లాండ్‌లో విహారయాత్ర చేస్తున్నారా? అంటూ ప్రశ్నించింది.బీజేపీ నేతలు షెహజాద్ పూనావాలా, ఆర్పీ సింగ్ వంటి వారు రాహుల్ పర్యటనల ఖర్చు, పారదర్శకతపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాహుల్ గాంధీ ఇప్పటివరకు సుమారు 55 సార్లు విదేశీ పర్యటనలు చేశారని, వీటికి దాదాపు రూ.60 కోట్లకు పైగా ఖర్చయి ఉండవచ్చని వారు అంచనా వేశారు. ఆయన వెల్లడించిన ఆదాయానికి, ఈ పర్యటనల ఖర్చులకు ఏమాత్రం పొంతన లేదని, ఈ పర్యటనలకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయో బహిర్గతం చేయాలని వారు డిమాండ్ చేశారు.
అయితే, బీజేపీ చేస్తున్న విమర్శలను కాంగ్రెస్ పార్టీ అంతే ధీటుగా తిప్పికొట్టింది. రాహుల్ గాంధీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నాయకుడని, ప్రపంచవ్యాప్తంగా ఆయనకు ఆహ్వానాలు అందుతుంటాయని పేర్కొంది.ఇవన్నీ కేవలం రాజకీయ ప్రేరేపిత ఆరోపణలనని కొట్టిపారేసింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్ ఈ విషయంపై స్పందిస్తూ, "రాహుల్ గాంధీ కేవలం మన దేశ నాయకుడే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ఆయన్ను గొప్ప నాయకుడిగా భావిస్తారు. అందుకే వివిధ దేశాలు, అంతర్జాతీయ సంస్థల నుంచి ఆయనకు నిరంతరం ఆహ్వానాలు వస్తుంటాయి" అని స్పష్టం చేశారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు

**మొదటి పేజీ తరువాయి**
ఈనెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన్ను సీఎం సలహాదారుగా ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో రామకృష్ణారావు స్థానంలో సంజయ్ జాజు సీఎస్‌గా నియమితులయ్యారు. కేంద్ర సర్వీసులో ఈశాన్య ప్రాంత అభివృద్ధి కార్యదర్శిగా పని చేస్తున్న ఆయన్ను తెలంగాణ రాష్ట్రానికి పంపుతూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం నిర్ణయం తీసుకుంది. 1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సంజయ్ జాజు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ సబ్ కలెక్టర్‌గా, పశ్చిమగోదావరి కలెక్టర్‌గా, హైదరాబాద్ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా, కమిషనర్‌గా, పౌరసరఫ రాల సంస్థ కమిషనర్‌గా పని చేశారు. 2014 నుంచి కేంద్ర సర్వీసులో ఉన్నారు. ఆయన 2029 ఫిబ్రవరి వరకు సర్వీసులో కొనసాగనున్నారు. కాగా రాష్ట్రంలో మొత్తం 13 మంది ఐఏఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. చేనేత హస్తకళల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్‌కు బాధ్యతలు అప్పగించింది.
అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌ను నియమించిన ప్రభుత్వం.. దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శిగా ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించింది. జీఏడీ (పొలిటికల్) ముఖ్య కార్యదర్శిగా అహ్మద్ నదీమ్‌ను నియమించింది. మైనారిటీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఎం ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్ నియమితులయ్యారు. రెవెన్యూ శాఖ (విపత్తు నిర్వహణ) ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జాను, ప్రభుత్వ (మైన్స్ అండ్ జియాలజీ) కార్యదర్శిగా ఎం.రఘునందన్ రావును, ఇన్వెస్ట్ తెలంగాణ, ఐ అండ్ సి డిపార్ట్ మెంట్ సీఈవోగా బి.అజిత్ రెడ్డిని నియమించారు. టీజీరెడ్కో వీసీ అండ్ ఎండీగా మహమ్మద్ ముషారఫ్ అలీ పారూఖీ, హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్, హ్యాండిక్రాఫ్ట్స్ ప్రత్యేక కార్యదర్శిగా పి.కాత్యాయని దేవి, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా కె.గంగాధర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపల్ కమిషనర్ గా టి.వెంకన్న, టూరిజం డైరెక్టర్ గా కె.విద్యాసాగర్ నియమితులయ్యారు. విద్యాసాగర్ సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ గా అదనపు బాధ్యతలను నిర్వర్తించనున్నారు. కె.చంద్రకళకు హెచ్ ఎండీఏ (కోర్ అర్బన్ రీజియన్, ల్యాండ్ పూలింగ్ అండ్ మెట్రో రైల్) జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ గా ప్రభుత్వం అదనపు బాధ్యతలను అప్పగించింది. రాష్ట్ర అటవీ ప్రధాన సంరక్షణ అధికారిగా వినయ్ కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఎంవో ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డిని ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవోగా బదిలీ చేసింది. సీఎంవో ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్‌ను నియమించింది.ం

# దేశంలో 'ఈజీ కనెక్ట్' ప్రారంభం..

**మొదటి పేజీ తరువాయి**
రామ్మోహన్ నాయుడు శుక్రవారం వారణాసిలోని లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి తొలి సర్వీస్‌ను లాంఛనంగా ప్రారంభించారు.ఈ కొత్త విధానంతో... ఇకపై చిన్న నగరాల నుంచి విదేశాలకు వెళ్లే ప్రయాణికులు తాము బయలుదేరే విమానాశ్రయంలోనే చెక్-ఇన్, ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ వంటి లాంఛనాలన్నీ పూర్తి చేసుకోవచ్చు. ఉదాహరణకు, వారణాసిలో అంతర్జాతీయ ప్రయాణం మొదలుపెట్టే వారు అక్కడే అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసి, దేశీయ విమానంలో ఢిల్లీ వంటి ఇంటర్నేషనల్ హబ్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ఎలాంటి తనిఖీలు లేకుండా నేరుగా అంతర్జాతీయ విమానం ఎక్కవచ్చు.ఈ సందర్భంగా మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. విమాన ప్రయాణాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, భారత విమానయాన రంగాన్ని ప్రపంచంలోనే పోటీపడేలా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. "భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా, స్వయం సమృద్ధి కలిగిన ఏవియేషన్ రంగాన్ని నిర్మించడంలో ఇది ఒక కీలక ముందడుగు" అని ఆయన తెలిపారు.ఈ 'ఈజీ కనెక్ట్' వ్యూహంతో 2030 నాటికి భారత్‌ను ప్రయాణికులకు ప్రాధాన్య ఏవియేషన్ హబ్‌గా, 2047 నాటికి గ్లోబల్ ఏవియేషన్ హబ్‌గా మార్చాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విధానం వల్ల పర్యాటకం, వాణిజ్యం, పెట్టుబడులు పెరిగి ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. దీని ద్వారా 2030 నాటికి దాదాపు 4 లక్షల ఉద్యోగాలు, 30 బిలియన్ డాలర్ల అదనపు జీడీపీ సమకూరుతుందని అంచనా.

# కొత్త కోర్కెలతో 'రొట్టెల పండుగ'

**మొదటి పేజీ తరువాయి**
కులమతాలకు అతీతంగా, హిందూ-ముస్లిం ఐక్యతకు నిలువెత్తు రూపంగా నిలిచే ఈ పండుగ కోసం జిల్లా యంత్రాంగం అన్ని రకాల భారీ ఏర్పాట్లు పూర్తి చేసింది.

**చారిత్రాత్మక నేపథ్యం నమ్మకం**
బారాషహీద్ దర్గాకు దాదాపు 415 సంవత్సరాల ఘనమైన చరిత్ర ఉంది. ఒక గొప్ప ఆశయం కోసం ప్రాణత్యాగం చేసిన 12 మంది అమరవీరుల స్మృత్యర్థం ఈ దర్గా నిర్మితమైంది. గతంలో ఆర్కాటు నవాబు భార్య తీవ్ర అనారోగ్యానికి గురికాగా, ఈ దర్గాను దర్శించుకున్న తర్వాత ఆమె పూర్తిగా కోలుకున్నారని చరిత్ర చెబుతోంది. దానికి కృతజ్ఞతగా నవాబు దంపతులు స్వర్ణాల చెరువు వద్ద భక్తులకు రొట్టెలను పంపిణీ చేశారు.
నాటి నుంచి ఈ సంప్రదాయం ఒక ఆచారంగా మారింది. తమ కోర్కెలు (ఉద్యోగం, వివాహం, ఆరోగ్యం, సంతానం, విద్య, వ్యాపారం మొదలైనవి) నెరవేరిన భక్తులు స్వర్ణాల చెరువులో దిగి మొక్కుబడిగా రొట్టెలను సమర్పిస్తారు (ఇస్తారు). కొత్తగా కోర్కెలు కోరుకునే వారు ఆ రొట్టెలను అందుకుంటారు (పుచ్చుకుంటారు). ఈ రొట్టెల మార్పిడే ఈ పండుగలోని ప్రధాన ఆకర్షణ. 2015లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ వేడుకను 'రాష్ట్ర పండుగ'గా గుర్తించింది.



**పండుగ ముఖ్య విశేషాలు.. షెడ్యూల్**
నేటి నుంచి 30వ తేదీ వరకు జరిగే ఈ వేడుకల్లో రోజువారీ కార్యక్రమాలు ఇలా సాగనున్నాయి:
జూన్ 26: 'సందల్ మాల్' (గంధం పూసే పవిత్ర కార్యక్రమం)తో పండుగ అధికారికంగా ప్రారంభమవుతుంది.
జూన్ 27: దర్గా ప్రాంగణంలో 'గంధ మహోత్సవం'.
జూన్ 28: ప్రధానమైన 'రొట్టెల పండుగ' రోజు. ఈ రోజున స్వర్ణాల చెరువు ఘాట్లలో భక్తులు భారీ సంఖ్యలో రొట్టెలను మార్పిడి చేసుకుంటారు.
జూన్ 29: ప్రత్యేక ప్రార్థనలతో కూడిన 'తహ్లీల్ ఫాతెహా'.
జూన్ 30: అధికారిక ముగింపు వేడుకలు.

**ప్రభుత్వ ఏర్పాట్లు భద్రత**
ఈ ఏడాది పండుగకు దాదాపు 14 లక్షల నుంచి 20 లక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి.నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దర్గా అభివృద్ధి పనుల నిమిత్తం ప్రభుత్వం రూ. 5 కోట్లు కేటాయించింది.
భక్తుల సౌకర్యార్థం స్వర్ణాల చెరువు వద్ద ప్రత్యేక ఘాట్లు, తాగునీటి సదుపాయం, నిరంతర విద్యుత్ సరఫరా, మొబైల్ టాయిలెట్లు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోటు షికారు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల నేతృత్వంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. డ్రోన్లు, సీసీటీవీ కెమెరాలతో నిఘా ఉంచడంతో పాటు, ట్రాఫిక్ ఆంక్షలు, ప్రత్యేక పార్కింగ్ జోన్లను కూడా ఏర్పాటు చేశారు.

# ప్రజా సేవలు మరింత చేరువ

**మొదటి పేజీ తరువాయి**
ఇది అధికారుల పనిని 99 శాతం సులభతరం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.
శుక్రవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రి లోకేశ్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ లక్ష్యాలు, ప్రాజెక్టుల పురోగతిని ఆ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.
రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల సమాచారాన్ని ఒకేచోట క్రోడీకరించే 'డేటా లేక్' పనులను జులై నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పాఠశాలల్లో డ్రాప్ అవుట్ల సంఖ్యను డేటా లేక్ ద్వారా విశ్లేషించి, వారిని తిరిగి బడికి రప్పించే మార్గాలను అన్వేషించాలని సూచించారు. సంజీవని కార్యక్రమాన్ని కూడా డేటా లేక్‌తో అనుసంధానించాలన్నారు.

**ప్రజా సేవలు మరింత చేరువ కావాలి**
ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా అందించేందుకు 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ వినియోగంపై నెలరోజుల పాటు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని లోకేష్ ఆదేశించారు. ఈ సేవలను ఎలా వినియోగించుకోవాలి, దానివల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. అదేవిధంగా కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల మంజూరులో ఉన్న అడ్డంకులను తొలగించాలని, రేషన్ కార్డుల విభజన, పేర్ల చేర్పులు, తొలగింపుల ప్రక్రియను మరింత సరళతరం చేయాలని స్పష్టం చేశారు.

**ఎల్‌నినో, విద్యుత్ డిమాండ్‌పై అప్రమత్తత**
రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు జలవనరులు, వ్యవసాయ శాఖలతో పాటు ఇతర విభాగాలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. నీటి వృథాను అరికట్టి, తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. జలాశయాల్లో నీటి లభ్యత, భూగర్భజలాల స్థాయిని ఆర్టీజీఎస్‌లోని 'అవేర్' విభాగం ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, ముఖ్యంగా రాయలసీమలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.
వర్షాభావ పరిస్థితుల వల్ల జల విద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉన్నందున, విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డిజిటల్ పురోగతితో ఆర్థిక సాధికారత

**మొదటి పేజీ తరువాయి**
సామాన్యులకు ఏ విధంగా మరింత సులభంగా, సరసమైన ధరల్లో అందుబాటులోకి వచ్చాయనే అంశంపై ప్రధానంగా చర్చలు జరిగాయి. ఈ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు సామాన్య పౌరుల జీవన ప్రమాణాలను ఏ విధంగా మారుస్తున్నాయో ఇద్దరు నేతలూ సుదీర్ఘంగా సమీక్షించారు. ధాని మోదీ తన (ట్విట్టర్) ఖాతా ద్వారా ఈ సమావేశం గురించి వివరిస్తూ, ఆర్థిక సమ్మిళితంలో ప్రపంచవ్యాప్తంగా బలమైన గొంతుకగా ఉన్న క్వీన్ మాక్సిమాను కలవడం సంతోషంగా ఉందని తెలిపారు. భారతదేశంలో ఆధార్, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ , ప్రధాన మంత్రి జన్-ధన్ యోజన వంటి డిజిటల్ పబ్లిక్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నడిచే డిజిటల్ విప్లవం.. ప్రజల జీవన ప్రమాణాల్ని ఏ విధంగా పెంచుతోందో వారు చర్చించారు. ఈ డిజిటల్ విధానాలు లక్షల మంది ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి, ఆర్థిక సాధికారత కల్పిస్తున్నాయని ఆయన ఈ సందర్భంగా వివరించారు. భారతదేశం సాధించిన ఈ సాంకేతిక, ఆర్థిక సమ్మిళిత అనుభవాలను ప్రపంచంలోని ఇతర భాగస్వామ్య దేశాలతో పంచుకోవడానికి భారత్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలకు భారతదేశ మోడల్ ఒక ఖర్చు-తక్కువ, సులభతరమైన మార్గదర్శకంగా నిలుస్తుందని భారత ప్రభుత్వం పదేపదే తెలియజేస్తోంది. ఐక్యరాజ్యసమితి ఫైనాన్షియల్ హెల్త్ అడ్వకేట్‌గా తన మూడు రోజుల భారత పర్యటనలో భాగంగా క్వీన్ మాక్సిమా.. ముంబై, న్యూఢిల్లీలను సందర్శించారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, భారతదేశం ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో అద్భుతమైన ప్రగతిని సాధించిందని ప్రశంసించారు. ఒకప్పుడు కేవలం బ్యాంకింగ్ సేవలు అందించడం పైనే దృష్టి ఉండగా, ఇప్పుడు ఈ సాంకేతికతను ఉపయోగించి ప్రజల వాస్తవ ఆర్థిక ఆరోగ్యాన్ని ఎలా మెరుగుపరచాలన్నది ప్రధాన అంశంగా మారిందని ఆమె అన్నారు. ముంబై పర్యటనలో క్వీన్ మాక్సిమా కొందరు సాధారణ ప్రజలు, నర్సులు, యువతతో ముఖాముఖి చర్చలు జరిపారు. వారు తమ ఆర్థిక నిర్వహణ, బడ్జెటింగ్, పొదుపు కోసం డిజిటల్ యాప్‌లను ఎలా ఉపయోగిస్తున్నారో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అట్టడుగు వర్గాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలను ఉచితంగా అందించే 'జన్ ధన్' పథకం లబ్ధిదారులతో కూడా ఆమె ముచ్చటించి వారి సాధక బాధకాలను విన్నారు. డిజిటల్ చెల్లింపులు, సబ్సిడీల నేరు బదిలీ వంటి కార్యక్రమాలతో భారతదేశం ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోంది. భవిష్యత్తులో అందరికీ సురక్షితమైన, అనుకూలమైన ఆర్థిక వ్యవస్థను సృష్టించడంలో క్వీన్ మాక్సిమా, ప్రధాని మోదీ మధ్య జరిగిన ఈ చర్చలు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

# ఆపరేషన్ సిందూర్ లో ఆరుగురు అమరులు

**మొదటి పేజీ తరువాయి**
ధైర్యసాహసాలు ప్రదర్శించి వీరమరణం పొందిన ఆ జవాన్ల వివరాలను నేషనల్ వార్ మెమోరియల్ అధికారిక వెబ్‌సైట్‌లోని 'రోల్ ఆఫ్ ఆనర్-2025' జాబితాలో చేర్చారు. త్వరలో న్యూఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకంలో ప్రత్యేక శిలాఫలకాలపై వారి పేర్లను శాశ్వతంగా చెక్కనున్నారు.'ఆపరేషన్ సిందూర్'లో భారత సైన్యానికి చెందిన ఐదుగురు, భారత వైమానిక దళానికి చెందిన ఒకరు వీరమరణం పొందారు. వీరిలో సుబేదార్ మేజర్ పవన్ కుమార్ (10 ఇన్‌ఫాంట్రీ బ్రిగేడ్ హెడ్‌క్వార్టర్స్), రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్ (4వ బెటాలియన్, జమ్మూ కశ్మీర్ లైట్ ఇన్‌ఫాంట్రీ), లాన్స్ నాయక్ దినేశ్ కుమార్ (5 ఫీల్డ్ రెజిమెంట్), హవిల్దార్ సునీల్ కుమార్ సింగ్ (237 ఫీల్డ్ వర్క్‌షాప్), అగ్నివీర్ మురళీ నాయక్ (851 లైట్ రెజిమెంట్), భారత వైమానిక దళానికి చెందిన సార్జెంట్ సురేంద్ర కుమార్ ఉన్నారు. దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన వీరి సేవలను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించి జాతీయ స్థాయిలో గౌరవించింది. ఈ అమరవీరుల్లో రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్‌కు మరణానంతరం దేశంలోని మూడో అత్యున్నత యుద్ధ పురస్కారమైన 'వీర చక్ర'ను ప్రకటించారు. అలాగే భారత వైమానిక దళానికి చెందిన సార్జెంట్ సురేంద్ర కుమార్‌కు 'వాయుసేన మెడల్' ప్రదానం చేశారు. ఇటీవల రాష్ట్రపతి భవన్‌లో జరిగిన రక్షణ పురస్కారాల కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్ తల్లిదండ్రులు వీరచక్రను అందుకున్నారు.

దేశ రక్షణలో చూపిన అసాధారణ ధైర్యానికి గుర్తింపుగా ఈ పురస్కారాలను కేంద్రం ప్రకటించింది.ఈ ఆరుగురిలో తెలుగు వ్యక్తి అగ్నివీర్ మురళీ నాయక్ పేరు ఉంది. ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా కళ్లితండాకు చెందినవారు. 2022లో అగ్నివీర్‌గా భారత సైన్యంలో చేరిన మురళీ నాయక్ తొలుత పంజాబ్, అసోంలో విధులు నిర్వహించారు. అనంతరం జమ్మూ కశ్మీర్ సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా పాకిస్తాన్‌తో జరిగిన ఎదురు కాల్పుల్లో వీరమరణం పొందారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన యువ సైనికుడు దేశం కోసం ప్రాణత్యాగం చేయడం అప్పట్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.గత ఏడాది ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో 26 మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. దీనికి ప్రతీకారంగా భారత్ మే 7న 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్తాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై వైమానిక, సైనిక దాడులు నిర్వహించింది. ఉగ్రవాద మౌలిక సదుపాయాలనే లక్ష్యంగా చేసుకుని భారత సాయుధ దళాలు ఈ ఆపరేషన్‌ను అత్యంత వ్యూహాత్మకంగా అమలు చేశాయి.

**ఇప్పుడు అధికారికంగా**
ఇప్పటి వరకు 'ఆపరేషన్ సిందూర్'లో వీరమరణం పొందిన జవాన్ల వివరాలను అధికారికంగా ప్రకటించలేదు. తాజాగా నేషనల్ వార్ మెమోరియల్ వెబ్‌సైట్‌లో వారి పేర్లను 'రోల్ ఆఫ్ ఆనర్-2025'లో చేర్చడంతో ఈ ఆరుగురు అమరవీరుల త్యాగానికి దేశం అధికారిక గుర్తింపు ఇచ్చినట్లైంది. త్వరలో జాతీయ యుద్ధ స్మారకంలోని శిలాఫలకాలపై వారి పేర్లు శాశ్వతంగా చెక్కనుండటంతో భారత సైనిక చరిత్రలో వారి సేవలు చిరస్థాయిగా నిలిచిపోనున్నాయి. దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన ఈ వీరజవాన్లకు యావత్ దేశం మరోసారి ఘనంగా నివాళులర్పిస్తోంది.

# జూన్ 28 వ తేదీన పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.


**..ఐదేళ్లలోపు ఉన్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి. -.జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**

ఆంధ్ర ప్రగతి కర్నూలు , జూన్ 26 : జిల్లాలో జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు.

శుక్రవారం పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కు సంబంధించిన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని జూన్ 28, 29, 30 తేదీలలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జూన్ 28 వ తేదీన బూత్ స్థాయి లో పోలియో చుక్కలను వేస్తారని, ఆ రోజు మిస్ అయిన పిల్లలకు 29, 30 తేదీల్లో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 0 నుండి 5 సంవత్సరాల పిల్లలు 3,52,164 మంది ఉన్నారని, వీరందరికీ పోలియో చుక్కలు వేయించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం 1630 పోలియో బూత్ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తల్లిదండ్రులందరూ తమ ఐదేళ్లలోపు పిల్లలకు జూన్ 28న సమీప పోలియో బూత్‌లో తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు అయ్యేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టణాల్లో కార్యక్రమం గురించి



తెలిసేలా విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు. ఆడియో వీడియోలను పట్టణాలు, కర్నూలు నగరంలో ప్రదర్శించాలని ట్రాఫిక్ సిగ్నల్ ల వద్ద అనౌన్స్మెంట్ చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీల ద్వారా టామ్ టామ్ ద్వారా తెలియజేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిపివో నుఆదేశించారు. విద్యార్థులు,ఎన్జీవోలు, మహిళా సంఘాలు తదితరులతో ర్యాలీలు నిర్వహించాలని కలెక్టర్ డీఈవో, మున్సిపల్ కమిషనర్లు, డి ఆర్ డి ఏ, మెప్మా పీడీలను ఆదేశించారు. అంగన్వాడీ టీచర్లు, ఆశా, ఏఎన్ఎం ల ద్వారా వినియోగించుకొని పిల్లలు అందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. మిస్ అయిన పిల్లలకు మరుసటి రోజు ఇంటింటికీ వెళ్ళి పోలియో చుక్కలు వేయించాలన్నారు. సిడిపిఓ లు, సూపర్వైజర్లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని ఐసిడిఎస్ పీడీని ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్లలో ప్రజలకు తెలిసే విధంగా బస్సులకు స్టిక్కర్లను అతికించడం, ఆడియో, వీడియో ల ప్రదర్శన చేయాలన్నారు. 27వ తేదీన విద్యార్థులతో ర్యాలీ నిర్వహించాలని, ప్రేయర్ లో పల్స్ పోలియో తేదీల గురించి పిల్లలకు చెప్పాలని, బ్లాక్ బోర్డ్ మీద తేదీలను రాయించి, విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ డీఈవో ను ఆదేశించారు. మహిళా సంఘాలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, వారి పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించేలా చర్యలు తీసుకోవాలని డిఆర్డిఏ పిడి, మెప్మా పీడీని ఆదేశించారు. పోలియో వ్యాక్సిన్ నిల్వ ఉంచిన గవర్నమెంట్ హాస్పిటల్స్, పిహెచ్సిలలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈని ఆదేశించారు. కార్మికులు, వలస వచ్చిన వారి పిల్లలకు పోలియో చుక్కలు వేయించేలా తగిన చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఓ ను ఆదేశించారు. కార్యక్రమం గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని సమాచారశాఖ డిడి ని ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్ లో డిఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమాదేవి, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ ఈ ప్రదీప్ కుమార్, ఐసిడిఎస్ పిడి విజయ, డి ఆర్ డి ఏ పి డి రమణారెడ్డి, మెప్మా పీడీ శ్రీనివాసులు, డిఇఓ సుధాకర్, ఆర్టీసీ ఆర్ ఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

# మాదకద్రవ్యాలకు 'నో' చెప్పండి ఆరోగ్యకరమైన జీవితానికి 'అవును' చెప్పండి.

**- సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల**





**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ జూన్ 26:**
అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా, సి. బెళగల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల లో జిల్లా యువజన సంక్షేమ శాఖ - సెట్కూరు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించడమైనది.

ఈ సందర్భంగా సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వ్యక్తిని మాత్రమే కాదు, కుటుంబాన్ని, సమాజాన్ని, దేశ భవిష్యత్తును కూడా నాశనం చేస్తాయి అని తెలిపారు. ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఇతరులను కూడా వాటి బారిన పడకుండా చైతన్యం కల్పించాలి అని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన యువతే దేశానికి నిజమైన సంపద. ప్రస్తుత యువతకు టీనేజ్ లో స్నేహితులు మగతనం అంటే సిగరెట్లు తాగడం, బీరు తాగడం అని ఇగోని రెచ్చగొడుతుంటారని, అటువంటి రెచ్చగొట్టే మాటలకూ లొంగకుండా మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటేనే ఆరోగ్యకరమైన, అభివృద్ధి చెందిన సమాజాన్ని నిర్మించగలమన్నారు.

డ్రగ్స్ వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని, కావున వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం మనం దేశం ఎదుర్కొంటున్న కీలక సమస్యలలో ఒకటైన మదకద్రవ్యల వినియోగం ని అరికట్టి మాదక ద్రవ్య రహిత సమాజం ఏర్పాటు కు యువత కృషి చేయాలని తెలిపారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ యువతపై పర్యవేక్షణ ఉంచి వారు డ్రగ్స్ బారిన పడకుండా చూడాలని కోరారు.

మాదకద్రవ్యాలకు 'నో' చెప్పండి ఆరోగ్యకరమైన జీవితానికి 'అవును' చెప్పండి అని విద్యార్థులకు తెలిపారు. తదుపరి సి.బెళగల్ ఏఎస్ఐ నాగయ్య మాట్లాడుతూ డ్రగ్స్ విక్రయాలు లేదా వినియోగం జరుగుతున్నట్లు అనుమానస్పద దృష్యాలు మీకు కనిపిస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చింతలయ్య గారు మాట్లాడుతూ చదువుకొనే వయసులో చెడు స్నేహల వల్ల సిగరెట్లు, బీరు మొదలగు వాటి తో మొదలై మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని కావున విద్యార్థులు చెడు స్నేహల జోలికి వెళ్లకుండా చదువు పై ద్రుష్టి పెట్టి మంచి మార్కులు సాధించి తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల కు, పుట్టిన ఊరుకు మంచిపేరు తేవాలని కోరారు.

# పంచాయతీరాజ్ కార్యాలయంలో "ఆ..అధికారి"

## సమావేశాల పేరుతో విధులకు డుమ్మా..!

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 26:**
నంద్యాల జిల్లా కేంద్రం పంచాయతీరాజ్ డిఇ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆ...అధికారి ఇంజనీరింగ్ విభాగంలో అభివృద్ధి పనులైన ప్రభుత్వ భవనాలు రోడ్లు డ్రైనేజీలు బ్రిడ్జిలు అలాగే త్రాగునీటి వసతి సరఫరా లాంటి వివిధ రకాల అభివృద్ధి పనులు పరిశీలించే బాధ్యత ఉన్న "ఆ అధికారి" సమావేశాల పేరుతో విధులకు డుమ్మా కొడుతున్నారని ప్రజలు బహిరంగంగా ప్రశ్నిస్తున్నారు. గతంలో "ఆ అధికారి" విధులు నిర్వహించిన ఏ ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా ఇదే తంతుగా వ్యవహరించడం "ఆ అధికారి" నైజం అని విమర్శలు కూడా ఉన్నాయి. కొన్ని మాసాల క్రితం నంద్యాల జిల్లా కేంద్రానికి బదిలీ చేస్తే అక్కడైనా సక్రమంగా విధులు నిర్వహిస్తారని ఉన్నత అధికారులు




భావించి నంద్యాల పంచాయతీరాజ్ కార్యాలయానికి బదిలీ చేశారు. అయినా "ఆ...అధికారి" పనుల్లో కానీ ప్రవర్తనలో గాని ఎటువంటి మార్పు కనిపించడం లేదని ప్రజలు నుండి గుసగుసలు గుంపుమంటున్నాయి. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసే గుత్తేదారులు"ఆ అధికారి"రాక కోసం ఎదురు చూడడం వెళ్ళిపోవడం "షరా మామూలు" అయిందని అంటున్నారు. ప్రభుత్వ నిబంధనలకు తూట్లు..

"ఆ అధికారి" నంద్యాల కు బదిలీ అయినప్పటి నుండి డివిజన్ పరిధిలోని గ్రామాల్లో ఇంజనీరింగ్ విభాగంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు నిర్మాణంలో ఉన్నాయా అలాగే త్రాగునీరు సరఫరా ఎలా ఉంది. రోడ్ల నిర్మాణాలు డ్రైనేజీలు ఏ స్థితిలో ఉన్నాయి. కాగా గుత్తేదారులు నాణ్యత పాటిస్తున్నారా లేదా అలాగే జలజీవన్ మిషన్ పథకం పర్యవేక్షణ చేయువలసిన బాధ్యత బాధ్యత అధికారిపై ఉంది. ముఖ్యంగా పంచాయతీలు, మండల పరిషత్తు మరియు జిల్లా పరిషత్ లు చేపట్టే అభివృద్ధి పనులను పరిశీలించి నాణ్యతలు పాటిస్తున్నారా లేదా పర్యవేక్షించి ఉన్నత అధికారులకు నివేదిక పంపాల్సిన పూర్తిస్థాయి బాధ్యత అధికారిపై ఉంది. కానీ ఆయన మాత్రం సమావేశాల పేరుతో విధులకు డుమ్మా కొడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే జనతా వారధి లక్ష్యం.

**-నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 26:**
జిల్లాలోని ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే 'జనతా వారధి' కార్యక్రమం లక్ష్యమని నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ అభిరుచి మధు అన్నారు. శుక్రవారం జిల్లా బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ వార్డులకు చెందిన మౌలిక వసతుల సమస్యలతో పాటు వికలాంగులు, మహిళలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అభిరుచి మధు మాట్లాడుతూ, అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్వాతి, జనతా వారధి కన్వీనర్ కాశెట్టి చంద్రశేఖర్, బీజేపీ నాయకులు పసుపుల రవీంద్ర కుమార్, ప్రభాకర్ రెడ్డి, రుషికేశవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లా నూతన అడిషనల్ ఎస్పీ గా బాధ్యతలు స్వీకరించిన షేక్ ఖాదర్ భాషా.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల క్రైమ్ జూన్ 26:**
సాధారణ బదిలీలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ గా బదిలీ కాబడిన షేక్. ఖాదర్ బాషా శుక్రవారం నాడునంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయం నందు బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వా. ఖాదర్ భాషా గారు జిల్లా పోలీస్ కార్యాలయంనకు రాగానే జిల్లా సాయుధ బలగాల నుండి గౌరవ వందనం స్వీకరించారు. 2012 బ్యాచ్ కి చెందిన ఖాదర్ భాషా గారి స్వస్థలం అనంతపురం జిల్లా. ఈయన గతంలో నంద్యాల జిల్లాలోని డోన్ సబ్ డివిజన్ డిఎస్పీగా కర్నూలు డీస్పీ గా విధులు నిర్వహించారు. రంపచోడవరం, చిత్తూరు, విజయవాడ డిఎస్పీగా సేవలందించారు. అనంతరం అడిషనల్ ఎస్పీగా ప్రమోషన్ పొంది కోనసీమ జిల్లాలో సేవలందించడం జరిగింది. ప్రస్తుతం ఇంటలిజెన్స్ విభాగం నుండి బదిలీపై నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ గా నేడు బాధ్యతలు స్వీకరించడం జరిగింది.

# మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు.!

## -.విద్యార్థులతో భారీ మానవహారం

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 26:**
యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా రక్షించడమే ధ్యేయంగా, జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో 26వ తేదీ శుక్రవారం నాడు డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్.డి.ఆర్ జూనియర్ కాలేజ్ మరియు నలంద జూనియర్ కాలేజ్ విద్యార్థుల సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ అవగాహన సదస్సులో జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి ఎస్. రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు."యువత ఈ సమాజానికి నిజమైన వెన్నెముక. దేశ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది. అటువంటి యువశక్తి మత్తు పదార్థాల బారిన పడి తమ జీవితాలను, భవిష్యత్తును నాశనం చేసుకోకూడదు. విద్యార్థులంతా డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ, ఉన్నత లక్ష్యాలను సాధించాలి.





సమాజంలో మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పోరాడాలి." అని అధికారి పిలుపునిచ్చారు. భారీ మానవహారం: మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఐక్యతను చాటుతూ విద్యార్థులంతా కలిసి ప్రధాన రహదారిపై ఒక భారీ మానవహారాన్ని ఏర్పాటు చేశారు. నిరసన ప్రదర్శన: "మత్తు పదార్థాలను వదిలేద్దాం - జీవితాన్ని కాపాడుకుందాం" అంటూ ప్లకార్డులు, బ్యానర్లు చేతబూని విద్యార్థులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ప్రతిజ్ఞ: తమ కళాశాలలను, సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మారుస్తామని, తాము ఎన్నటికీ మత్తు పదార్థాలకు బానిసలం కాబోమని విద్యార్థులందరితో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్.డి.ఆర్, నలంద జూనియర్ కళాశాలల యాజమాన్యం, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు మరియు ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించేంతవరకు పోరాటం ఆగదు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 26:**
నంద్యాల పట్టణంలో పీ.డీ.ఎస్.యు రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు జూన్ 25, 26 తేదీల్లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సమావేశాలకు పీ.డీ.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎం.డి. రఫీ అధ్యక్షత వహించారు. సమావేశం ప్రారంభానికి ముందు విద్యార్థి అమరవీరులకు రెండు నిమిషాల మౌనం పాటించి ఘన నివాళులు అర్పించారు.




అనంతరం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో దేశ, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో పెరుగుతున్న ఫీజుల దోపిడీ, కాపిటేషన్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు, హాస్టల్, రవాణా తదితర పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులపై మోపుతున్న అదనపు ఆర్థిక భారంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, విద్య హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా రంగంపై ప్రభుత్వం సమర్థవంతమైన నియంత్రణను అమలు చేయడంలో విఫలమవుతోందని, విద్యను వ్యాపారంగా మార్చే ధోరణిని అరికట్టాలని కోరారు. ఫీజుల నియంత్రణకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు, చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను బలోపేతం చేయాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.
రాష్ట్రవ్యాప్త ఉద్యమ కార్యాచరణలో భాగంగా జూలై 2న మంగళగిరిలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం ఎదుట ధర్నా, జూలై 10 నుంచి 15 మధ్య అన్ని జిల్లాల్లో డీఈఓ, డీవైఈఓ కార్యాలయాల ఎదుట ధర్నాలు, వినతిపత్రాల సమర్పణ, జూలై 19న మంగళగిరిలోని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట రాష్ట్రస్థాయి ధర్నా నిర్వహించాలని రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది.
విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు, నిరసనలు, వినతిపత్రాల సమర్పణ, చైతన్య కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. విద్య హక్కును కాపాడేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాసంఘాలు ఐక్యంగా పోరాటాల్లో పాల్గొనాలని పీ.డీ.ఎస్.యు పిలుపునిచ్చింది.
ఈ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొని పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పీ.డీ.ఎస్.యు పోరాటాలను మరింత ఉధృతం చేస్తుందని రాష్ట్ర కార్యవర్గం స్పష్టం చేసింది.ఈ కార్యక్రమంలో పీ.డీ.ఎస్.యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. సిద్ధు, రాష్ట్ర కోశాధికారి సోమశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం. ధనరాజు, షాహీద్,భాను ప్రసాద్, మావో, వేణు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశలోనే డ్రగ్స్ అలవాట్లకు దూరంగా ఉండాలి.

..విద్యార్థి భవిష్యత్తు మత్తులో కాదు... లక్ష్యంపై ఉండాలి.

..మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించిన.

నంద్యాల సబ్ డివిజన్ అడిషనల్ ఎస్పీ కుమారి ఎం జావళి.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ జూన్ 26:**
అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలలో మాదకద్రవ్యాల వలన కలిగే దుష్ప్రభావాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు నంద్యాల పట్టణ కేంద్రంలో గల శ్రీ రామకృష్ణ డిగ్రీ & పీజీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి ప్రమాదకరమైన మత్తుపదార్థాలను యువత ఎట్టి పరిస్థితుల్లోనూ ముట్టకూడదని, వాటికి దూరంగా ఉండాలని హెచ్చరించారు.కాలేజీ విద్యార్థుల్లో డ్రగ్స్ అలవాటు ఎలా మొదలవుతుందో వివరిస్తూ, "కేవలం ఒకసారి ట్రై చేస్తే తప్పేముంది? ఒక్కసారికి ఏమవుతుంది?" అనే చిన్న ఆలోచన తో ఈ వ్యసనం రూపుదాల్చుతుందని వ్యక్తం చేశారు. దురదృష్టవశాత్తూ, అలా ఒక్కసారి సరదాగా ప్రారంభించిన వారిలో అత్యధికులు ఆ తర్వాత ఆ అలవాటును వదులుకోలేరని, తమకు తెలియకుండానే దానికి బానిసలుగా మారిపోతారని తెలిపారు.
స్నేహితుల ఒత్తిడి కారణంగా కూడా చాలా మంది యువతీ యువకులు ఆల్కహాల్, సిగరెట్లు, గంజాయి వంటి చెడు అలవాట్ల వైపు ఆకర్షితులవుతున్నారని, అటువంటి సమయాల్లో విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూ, దృఢమైన నిర్ణయాలతో వాటిని తిరస్కరించాలని, విద్యార్థి భవిష్యత్తు మత్తులో కాకుండా మనం ఎంచుకునే లక్ష్యం వైపు ఉండి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఏఎస్పీ ఆకాంక్షించారు.

# జూన్ 30 వ తేదీన నంద్యాల జిల్లా స్థాయి రాపిడ్,బ్లిట్జ్ చెస్ పోటీలు.

..శ్రీ రామకృష్ణ డిగ్రీ కాలేజ్ స్వామి వివేకానంద ఆడిటోరియంలో.

..రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 26:**
ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహించబోయే రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో పాల్గొనే జిల్లా రాపిడ్,బ్లిట్జ్ జట్ల ఎంపిక కోసం నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 30 వ తేదీ రామకృష్ణ డిగ్రీ కళాశాల స్వామి వివేకానంద ఆడిటోరియంలో నంద్యాల జిల్లా స్థాయి రాపిడ్ అండ్ బ్లిట్జ్ చెస్ పోటీలు వేరు వేరుగా నిర్వహించడం జరుగుతుందని నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు,ఆంధ్ర చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్ డాక్టర్. జి. రవికృష్ణ, జిల్లా చెస్ కార్యదర్శి రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈనెల 29 వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు ఏపీ చెస్ వెబ్ సైట్ లోఎంట్రీలు నమోదు చేసుకోవాలని,నంద్యాల జిల్లా ఎంపికైన క్రీడాకారులు త్వరలో కాకినాడ లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.ఇతర వివరాలకు సంప్రదించవలసిన నెంబర్ 9010451585.


వివరాలు ప్రకటిస్తున్న నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రవి కృష్ణ, రామసుబ్బారెడ్డి.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి -అందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలి**

**క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలి -ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచన**



**అమరావతి, జూన్ 26 ఆంధ్ర ప్రగతి :** వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారుల్ని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి భద్రత, దోమల నియంత్రణ చర్యలపై అధికారులతో చర్చించారు. ప్రజారోగ్య పరిరక్షణను ప్రతి గ్రామ పంచాయతీ అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా అన్ని పంచాయతీల్లోనూ బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు తగిన మోతాదులో అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.ముఖ్యంగా మురుగు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవటం ద్వారా దోమల వ్యాప్తిని కట్టడి చేయగలుగుతామన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ, రోజు వారీ చెత్త సేకరణ శాస్త్రీయపద్ధతిలో నిర్వహించాలని, ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. "ఫ్రైడే -- డ్రైడే" కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి మురుగునీటి నిల్వలను తొలగించే ఏర్పాటు చేయాలన్నారు. సోషల్ మీడియా, వాట్సప్ గ్రూపులు, మైక్ అనౌన్స్?మెంట్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఇచ్చే తాగునీటి నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. తాగునీటి సరఫరా వ్యవస్థపై పర్యవేక్షణ ఉండాలని పైపు లైన్లలో లీకేజీలు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.జారోగ్య పరిరక్షణను ప్రతి గ్రామ పంచాయతీ అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలి. క్రమం తప్పకుండా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలి, అన్ని పంచాయతీల్లోనూ బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు తగిన మోతాదులో అందుబాటులో ఉంచాలి. ముఖ్యంగా వర్షపు నీరు, మురుగునీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవటం ద్వారా దోమల వ్యాప్తిని కట్టడి చేయాలి. శుభ్రత పాటించాలని సూచించారు.

# మార్కెట్ యార్డు భూమి కేటాయింపు రద్దు చేయాలి.

**-ఆర్ ఏ ఆర్ ఎస్ ను పరిరక్షించాలి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 26:**
రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆద్వర్యంలో "సమాజమే దేవాలయం... ప్రజలే దేవుళ్లు" చైతన్య గేయం ఆవిష్కరణ. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి రచించి, రూపొందించిన "సమాజమే దేవాలయం... ప్రజలే దేవుళ్లు" సిద్ధాంతమా? లేక కేవలం నినాదమా? ప్రజలే నిర్ణయించాలి... సమాజమే ఆలోచించాలి... అనే సందేశాత్మక గేయాన్ని శుక్రవారం నంద్యాలలోని సమితి ప్రధాన కార్యాలయంలో అఖిలపక్ష ప్రజా సంఘాల నాయకులు ఆవిష్కరించారు.




ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రైతాంగ సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ పరిశోధన కోసం ఏర్పాటు చేసిన ప్రజాహిత సంస్థలను పరిరక్షించి మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతులకు నిల్వ, మార్కెటింగ్, బ్యాంకింగ్ తదితర సేవలను విస్తరించాల్సిన నూనెపల్లె మార్కెట్ యార్డులోని విలువైన భూమిని రాజకీయ అవసరాలకు కేటాయించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా, రాయలసీమ రైతాంగ అభివృద్ధికి కీలకమైన నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లో తాత్కాలిక కలెక్టరేట్ కార్యాలయాన్ని కొనసాగించడం వల్ల వ్యవసాయ పరిశోధనలు, రైతులకు అందాల్సిన సేవలకు ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు. రైతుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రజా సంస్థల భూములను ఇతర అవసరాలకు వినియోగించడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు.
"సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు" అనే సిద్ధాంతాన్ని విశ్వసిస్తున్నామని చెప్పే పాలకులు, ప్రజాహిత సంస్థల ఆస్తులను రాజకీయ అవసరాలకు వినియోగించడం నిజంగా సిద్ధాంతమా? లేక కేవలం నినాదమా? అనే ప్రశ్నను ఈ గేయం సమాజం ముందుంచుతోందన్నారు.
ఈ ఉద్యమం ఏ ఒక్క రాజకీయ పార్టీకి వ్యతిరేకం కాదని, ప్రజా ఆస్తుల పరిరక్షణ, రైతాంగ సంక్షేమం, ప్రజా సంస్థల బలోపేతం కోసం జరుగుతున్న ప్రజాస్వామ్య ఉద్యమమని పేర్కొన్నారు. రైతు సంఘాలు, ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు, అన్ని రాజకీయ పార్టీలు కలిసి ప్రజా ఆస్తులను కాపాడేందుకు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.
నూనెపల్లె మార్కెట్ యార్డులో తెలుగుదేశం పార్టీ కార్యాలయం కోసం కేటాయించిన రెండు ఎకరాల భూమి కేటాయింపును ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని, రైతాంగ ప్రయోజనాలను కాపాడాలని నాయకులు డిమాండ్ చేశారు. అలాగే, నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థలం లో ఏర్పాటు చేసిన కలెక్టరేట్ కార్యాలయాన్ని ప్రత్యామ్నాయ ప్రాంతానికి తరలించి, వ్యవసాయ పరిశోధన సంస్థను పూర్తిస్థాయిలో పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.
ఈ కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు యర్రం శంకర్ రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, ప్రముఖ న్యాయవాది శంకరయ్య, ఏపీ రైతు సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి రామచంద్రుడు, సహాయ కార్యదర్శి సురేష్, గాయకుడు నారాయణ గౌడ్, భాస్కర్ రెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు, పట్నం రాముడు, రాఘవేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం ప్రాజెక్టు నీటి ముంపు బాధితులకు న్యాయం చేయాలి.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 26:**
శ్రీశైలం ప్రాజెక్టు నీటిముంపు బాధితుల రిలే నిరాహార దీక్షలు 93వ రోజుకు. చేరిన సందర్భంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి చేరేలా సంతకాల సేకరణ చేపట్టడం జరిగిందన్నారు.జీవో నెం.98 ప్రకారం బాధితులకు ఉద్యోగాలు కల్పించాలి. ప్రభుత్వానికి గుజ్జుల గౌరీశ్వర నాయుడు, విజ్ఞప్తిశ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా నిర్వాసితులై, జీవో నెం.98 ప్రకారం ఉద్యోగ నియామకాల కోసం పోరాడుతున్న నీటిముంపు బాధితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 93వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాల్మీకి బోయ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గుజ్జుల గౌరీశ్వర నాయుడు బాధితులకు తన సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రజా మద్దతు సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, దశాబ్దాలుగా న్యాయం కోసం ఎదురు చూస్తున్న నీటిముంపు బాధితుల సమస్యను ప్రభుత్వం అత్యంత మానవతా దృక్పథంతో పరిశీలించాలని కోరారు. జీవో నెం.98 ప్రకారం అర్హులైన ప్రతి నిర్వాసిత కుటుంబానికి ఉద్యోగాలు కల్పించి, వారి కుటుంబాలకు శాశ్వత భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.గత 93 రోజులుగా ఎండనక, వాననక నిరంతర దీక్షలు కొనసాగిస్తున్న బాధితుల ఆవేదన, ఆక్రోశం, బాధలను ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు గుర్తించి వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బాధితుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి వారి దీక్షలను విరమింపజేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.
ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీ.పీ.ఐ.(ఎం.ఎల్.) లిబరేషన్ పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదేల పవన్ కళ్యాణ్, విద్యా, ఐటీ మరియు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే స్పందించాలని కోరారు.
నీటిముంపు బాధితుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లేకపోతే ఈ ఉద్యమం మరింత ఉధృతమయ్యే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు.అలాగే, జిల్లా కలెక్టర్ వెంటనే సమగ్ర నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించి, జీవో నెం.98 అమలుకు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జీవో నెం.98 శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు జయన్న, బి నాగేంద్ర,మహిళా నాయకులు, మహిళా నిరుద్యోగ బాధితులు, సీ.పీ.ఐ ఎం.(యం.ఎల్.) లిబరేషన్ పార్టీ నందికొట్కూరు పట్టణ కార్యదర్శి కాటేపోగు సామన్న, జూపాడుబంగ్లా కార్యదర్శి శ్రీరాములు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు.శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితుల న్యాయమైన హక్కులను ప్రభుత్వం తక్షణమే గుర్తించి, జీవో నెం.98ను పూర్తిస్థాయిలో అమలు చేసి అర్హులైన బాధితులకు ఉద్యోగాలు కల్పించాలని సభలో పాల్గొన్న నాయకులు ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు.


EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002 AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శనివారం 27 జూన్ 2026

# ప్రభుత్వ కార్యాలయాలే మందుబాబుల అడ్డా..!

## నూనెపల్లిలో ప్రభుత్వ భవనంలో మద్యం విందు కలకలం.

..వీడియోలు తీస్తుండగా పాత్రికేయులతో వాగ్వాదం. -"భవనం ఇంకా మా ఆధీనంలోకి రాలేదు" విద్యాశాఖ వివరణ.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 26:**
ప్రజలకు సేవలు అందించాల్సిన ప్రభుత్వ కార్యాలయాలే మందుబాబుల అడ్డాగా మారాయా..?? నంద్యాల జిల్లా నూనెపల్లిలో వెలుగుచూసిన ఘటన ఈ ప్రశ్నకు తావిస్తోంది. జిల్లా పంచాయతీరాజ్ ,ఆర్‌డబ్ల్యూఎస్,మండల పరిషత్ కార్యాలయాల సమీపంలోని నూతన మండల విద్యాధికారి కార్యాలయ భవనంలో కొందరు వ్యక్తులు మద్యం సేవిస్తూ,బిర్యానీతో విందు చేసుకుంటున్నారనే సమాచారం మేరకు మీడియా అక్కడికి చేరుకుంది. అక్కడ మద్యం సీసాలు,ఆహార పొట్లాల మధ్య కొందరు వ్యక్తులు కనిపించగా,పాత్రికేయులు ఫోటోలు,వీడియోలు చిత్రీకరిస్తుండగా అభ్యంతరం వ్యక్తం చేస్తూ వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలో మద్యం సేవించడం ఎలా సమంజసమని ప్రశ్నించగా,వారిలో ఒకరు స్థానిక అధికార పార్టీ వార్డు ఇంచార్జ్‌కు బంధువునని పేర్కొంటూ మాట్లాడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటనపై వివరణ కోరగా,నూతన మండల విద్యాధికారి కార్యాలయం ఇంకా ప్రారంభం కాలేదని,భవనం తమ శాఖ అధికారిక ఆధీనంలోకి రాలేదని సంబంధిత విద్యాశాఖ అధికారి తెలిపారు. దీంతో ప్రభుత్వ భవనం పర్యవేక్షణ ఎవరి బాధ్యత అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆస్తులను అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారన్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీశాయి. ఘటనపై సమగ్ర విచారణ జరిపి,ప్రభుత్వ భవనాల దుర్వినియోగానికి బాధ్యులెవరైనా ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# ఓటర్లకు ఎస్ ఐ ఆర్ అగ్నిపరీక్ష..!

.. ఎస్ ఐ ఆర్ పేరుతో కొత్త కసరత్తు.
..ధ్రువపత్రాల కోసం ప్రజల పరుగులు.
.. ఎస్ ఐ ఆర్ తో పెరిగిన టెన్షన్.
..ఓటు కోసం పత్రాల పోరు..ప్రజల్లో ఆందోళన.
.. సర్ సెగ..ధ్రువపత్రాల కోసం పరుగులు.
..ఓటు హక్కుకు కొత్త పరీక్ష..గందరగోళంలో ప్రజలు.
..ఓటు నా హక్కు..కానీ పత్రాలే ఆధారమా..?




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 26:**
ఓటు హక్కు వినియోగించుకోవాలంటే ఇక ధ్రువపత్రాలే దిక్కా..?? ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో కొనసాగుతాయా..?? లేక పత్రాల లేమితో తొలగింపునకు గురవుతాయా..?? అనే సందేహాలు ప్రజలను వెంటాడుతున్నాయి.
గ్రామాలు,పట్టణాల్లో ఇంటింటికీ తిరుగుతున్న బూత్ లెవల్ అధికారులు వివరాలు సేకరిస్తుండటంతో ప్రజలు పాత పత్రాల కోసం అలమటిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు,పేదలు,వలస కూలీలు,అద్దె ఇళ్లలో నివసించే కుటుంబాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

..2002 నాటి రికార్డులేనా ఆధారం..??
2002కు ముందు నమోదైన ఓటర్ల వివరాలపై స్పష్టత లేకపోవడం ప్రజల్లో గందరగోళానికి దారితీస్తోంది. పాత రికార్డులు అందుబాటులో లేని వారు తమ ఓటు హక్కు పరిస్థితి ఏమవుతుందోనని ప్రశ్నిస్తున్నారు. తల్లిదండ్రుల వివరాలు,జనన ధ్రువపత్రాలు,నివాస ఆధారాలు వంటి అంశాలపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

..వలస బాట పట్టిన వారి పరిస్థితి..??
ఉపాధి,విద్య,ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన లక్షలాది మంది ఓటర్ల పరిస్థితిపై కూడా చర్చ జరుగుతోంది. వారు సమయానికి అందుబాటులో లేకపోతే పేర్లు తొలగించే అవకాశం ఉందా..?? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో ఉంటేనే ఓటు హక్కు కొనసాగుతుందా..?? అంటూ ప్రజలు ఆరా తీస్తున్నారు.

..రాజకీయ వేడి..!!
ా×= ప్రక్రియపై రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. ఓటరు జాబితా ప్రక్షాళన అవసరమని ఒకవైపు వాదనలు వినిపిస్తుండగా, మరోవైపు అర్హులైన ఓటర్లను ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఎన్నికల రాజకీయాలు మరింత వేడెక్కాయి.

..ప్రజల్లో పెరుగుతున్న ఆందోళన..!!
"ఓటు వేయాలంటే ముందుగా పత్రాల యుద్ధం గెలవాలా..??" అనే ప్రశ్న సాధారణ ప్రజల నుంచి వినిపిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాలు,మీ సేవా కేంద్రాలు,రెవెన్యూ కార్యాలయాల వద్ద ధ్రువపత్రాల కోసం ప్రజల రద్దీ పెరుగుతున్నట్లు సమాచారం.

..ఎన్నికల సంఘం స్పష్టీకరణ..!!
అయితే ఎన్నికల సంఘం మాత్రం ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెబుతోంది. అర్హులైన ఒక్క ఓటరు కూడా నష్టపోకుండా,నకిలీ మరియు పునరావృత నమోదులను గుర్తించి జాబితాను మరింత పారదర్శకంగా రూపొందించడమే లక్ష్యమని అధికారులు వివరిస్తున్నారు. "ఓటు మన రాజ్యాంగ హక్కు...అప్రమత్తత మన బాధ్యత. పేరు జాబితాలో ఉందో?? లేదో?? ప్రతి ఓటరూ వెంటనే తనిఖీ చేసుకోవాలి" అని అధికారులు సూచిస్తున్నారు.

# డ్రమ్ములో నాలుగేళ్ల చిన్నారి మృతదేహం

## పులివెందులలో దారుణ ఘటన

**పులివెందుల, జూన్ 26 ఆంధ్ర ప్రగతి :**
పులివెందులకు సమీపంలోని గ్రామంలో జరిగిన దారుణ ఘటన సంచలనంగా మారుతోంది. గురువారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయిన నాలుగేళ్ల చిన్నారి చివరికి ఇంటి పరిసరాల్లో ఉండే డ్రమ్ములో మృతదేహమై కనిపించింది. దీంతో ఒక్కసారిగా కలకలం రేగింది. ఎక్కడికైనా వెళ్లి ఆడుకుంటుందేమో అన్న ఆలోచనలో ఉన్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఈ చిన్నారి అలా చూసి ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఇదంతా పొరుగింటి వారు చేసిన పనిగా అనుమానిస్తున్నారు. నాలుగేళ్ల చిన్నారి డ్రమ్‌లోకి వెళ్లేంత హైట్ కాదని చంపేసి అందులో పడేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. లింగాల మండలం లోపట్నూతల గ్రామంలో ఆ దారుణం జరిగింది. చిన్నారి పేరు నిత్విక. నాగవేటి రామాచారి, సృజన దంపతుల కుమార్తె. ఇంటి ఆవరణంలో ఆడుకుంటూనే గురవారం సాయంత్రం కనిపించుండా పోయింది. చిన్నారి కోసం చాలా ప్రాంతాల్లో గాలించారు. చివరకు ఆ చిన్నారి నీళ్ల ట్యాంకులో పడి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. డ్రమ్ నాలుగు అడుగులు ఉంటుందని చిన్నారి అందులో ఎలా పడి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇది గిట్టని వారు చేసిన పనిగానే చెబుతున్నారు.

# పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

## ఆగివున్న లారీని ఢీకొట్టిన తుపాను వాహనం

## ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి

**పల్నాడు, జూన్ 26 ఆంధ్ర ప్రగతి :**



పల్నాడు జిల్లాలో.. ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.. నలుగురు మృతి చెందారు. జిల్లాలోని.. మాచర్ల నగరవనం దగ్గర ఆగివున్న లారీని తుపాను వాహనం ఢీకొట్టింది. దీంతో వాహనంలోని నలుగురు అక్కడికక్కడే చనిపోయారు. మరికొందరు గాయాలపాలయ్యారు. వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. మృతులంతా హైదరాబాద్ వాసులుగా తెలిసింది. బంధువులు మృతి చెందడంతో తుపాను వాహనంలో పామూరు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదం కలిగించింది. విషయం తెలుసుకున్న స్థానికులు.. అయ్యో అంటున్నారు. చనిపోయిన వారి బంధువులను ఓదార్చేందుకు వెళ్తూ.. చనిపోవడం అనేది వారిని కలచివేసింది. తుపాను వాహనం అతివేగంతో రావడం వల్ల ఈ ప్రమాదం జరిగివుంటుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఐతే.. మన ఏపీ, తెలంగాణలో రోడ్లపై తరచూ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కొన్ని చోట్ల స్ట్రీట్ లైట్లు ఉండట్లేదు. మరికొన్ని చోట్ల రోడ్లపై గతుకులు బాగా ఉంటున్నాయి. అతివేగం చాలా ప్రాణాలు తీస్తోంది. వాహనం వేగంగా వెళ్లేదైనా.. నెమ్మదిగా వెళ్లడం మేలు. ఇలాంటి ప్రమాదాల్లో చాలా ప్రాణాలు కోల్పోతుంటే.. వారి కుటుంబ సభ్యులు అనేక రకాలుగా కష్టాల్లో పడుతున్నారు.
......

# మతం మారినంత మాత్రాన రిజర్వేషన్లు వర్తించవు

## ప్రభుత్వ ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమైనవి

## సంచలన తీర్పు వెల్లడించిన మద్రాస్ హైకోర్టు

**మద్రాస్, జూన్ 26 ఆంధ్ర ప్రగతి :**
మతం మార్పిడులు, రిజర్వేషన్ల ప్రయోజనాలపై మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. ఇతర వెనుకబడిన వర్గాల నుండి ఇస్లాం మతంలోకి మారిన వారికి "వెనుకబడిన తరగతి ముస్లిం" కేటగిరీ కింద రిజర్వేషన్ ప్రయోజనాలను కల్పిస్తూ తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వును హైకోర్టు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ పూర్తిగా కొట్టివేసింది. 2024 మార్చి 9న తమిళనాడు ప్రభుత్వం ఒక ప్రత్యేక ఉత్తర్వును జారీ చేసింది. దీని ప్రకారం... వెనుకబడిన తరగతి ), అత్యంత వెనుకబడిన తరగతి , డినోటిఫైడ్ కమ్యూనిటీస్ ), షెడ్యూల్డ్ కులాల (రాజ)కు చెందిన వ్యక్తులు ఇస్లాం మతంలోకి మారినప్పటికీ, వారు 'బీసీ ముస్లిం' కేటగిరీ కింద రిజర్వేషన్ ప్రయోజనాలను పొందడం కొనసాగించవచ్చని పేర్కొంది. అంతేకాకుండా, ప్రభుత్వం నోటిఫై చేసిన ఏడు ప్రత్యేక బీసీ ముస్లిం వర్గాలలో ఒకదానికి చెందిన సభ్యులుగా వారిని గుర్తిస్తూ కమ్యూనిటీ సర్టిఫికేట్లు జారీ చేయడానికి కూడా ఈ ఉత్తర్వు అనుమతించింది. తమిళనాడు ప్రభుత్వ భావన చట్టపరంగా మరియు భావనాత్మకంగా పూర్తిగా తప్పని మద్రాస్ హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. "ఇస్లాం మతంలోకి మారిన వ్యక్తి వెనుకబడిన తరగతి ముస్లిం హోదాను పొందలేరని మేము నిర్ధారిస్తున్నాము. మతం మారిన వ్యక్తి కేవలం ఒక ముస్లిం మాత్రమే అవుతాడు, అంతే తప్ప ప్రత్యేక వర్గానికి చెందడు" అని కోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఏడు ప్రత్యేక వెనుకబడిన ముస్లిం వర్గాలలో అన్సార్, దక్కనీ ముస్లింలు, దుబేకుల, లబ్బాయి, మాపిళ్ళ, షేక్, సయ్యద్ ఎవరైనా కొత్తగా మతం మారిన వారిని సభ్యునిగా పరిగణించడం సాధ్యం కాదని, అందువల్ల వారు ఆ వర్గం కింద రిజర్వేషన్లు పొందడానికి అర్హులు కారని కోర్టు తేల్చి చెప్పింది. జూలై 2008లో జారీ చేసిన ఒక ప్రభుత్వ ఉత్తర్వు ద్వారా తమిళనాడులోని పైన పేర్కొన్న ఏడు ముస్లిం వర్గాలను ప్రత్యేక కేటగిరీలో చేర్చారు. అయితే, ఇతర సామాజిక వర్గాల నుండి ఇస్లాంలోకి మారిన వారికి కూడా ఈ సర్టిఫికేట్లు ఇవ్వాలనే 2024 నాటి ప్రభుత్వ నిర్ణయం చెల్లదని హైకోర్టు స్పష్టం చేయడంతో తమిళనాడు ప్రభుత్వానికి దౌత్యపరంగా పెద్ద ఎదురుదెబ్బ తగిలింది.
............

# నంద్యాలలో ఇంటర్నేషనల్ యాంటీ డ్రగ్స్ డే పై అవగాహన ర్యాలీ.

## ..యువత మద్యం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి. -.డాక్టర్ బత్తుల సంజీవరాయుడు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 26:**
నంద్యాల పట్టణంలోని, ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంటర్నేషనల్ యాంటీ డ్రగ్స్ డే ను సఫర్డ్ సొసైటీ , ఏపీ వీహెచ్‌ఏ మరియు నంద్యాలలోని స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది, ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జాతీయ బీసీల కార్యదర్శి డాక్టర్ బత్తుల సజీవ రాయుడు మాట్లాడుతూ యాంటీ డ్రగ్స్ డే ప్రతి సంవత్సరం జూన్ 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని (ఇంటర్నేషనల్ డే అగయిన్స్ట్ డ్రగ్స్ అభియుస్ అండ్ ఇల్లికాల్, యాంటీ డ్రగ్స్ డేగా జరుపుకుంటారు. డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించడం మరియు వాటి వల్ల కలిగే దుష్పరిణామాలు, అక్రమ రవాణాపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. ఈ అంతర్జాతీయ దినోత్సవానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇక్కడ ఉన్నాయి: చరిత్ర మరియు ప్రాముఖ్యత ప్రారంభం: మాదకద్రవ్యాల వాడకం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంచడానికి యునైటెడ్ నేషన్స్ 1987లో ఈ దినోత్సవాన్ని ఏర్పాటు చేసింది. లక్ష్యం: డ్రగ్స్ బానిసత్వం సమాజాన్ని, ముఖ్యంగా యువత భవిష్యత్తును ఎలా నాశనం చేస్తుందో తెలియజేయడం. నివారణ చర్యలు: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో పోలీసు శాఖ, ప్రభుత్వ విద్యా సంస్థలు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు, పోస్టర్ల విడుదల మరియు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.
మాదకద్రవ్యాల దుష్పరిణామాలుఆరోగ్య సమస్యలు: నల్లమందు, గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. సామాజిక నష్టం: మత్తుకు బానిసైన వారి ప్రవర్తనలో మార్పు రావడం, కుటుంబాలు విచ్ఛిన్నం కావడం మరియు నేరాల సంఖ్య పెరగడానికి కారణమవుతుంది. యువతపై ప్రభావం: సరైన పర్యవేక్షణ లేకపోవడం మరియు ఒత్తిడిని తట్టుకోలేకపోవడం వల్ల యువత చెడు మార్గాలకు అలవాటు పడుతున్నారు. అంతర్జాతీయ డ్రగ్స్ దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీలు, నేషనల్ యాంటీ-డ్రగ్ ప్రాముఖ్యత, భారతదేశ చరిత్రలో డ్రగ్స్ (ఓపియం, గంజాయి, కోడైన్ మరియు హెరాయిన్) వ్యతిరేకంగా అవగాహన పెంపొందించడానికి ప్రతి సంవత్సరం అక్టోబర్-2న జాతీయ మాదకద్రవ్య వ్యసన వ్యతిరేక దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. ఇంటర్నేషనల్ యాంటీ డ్రగ్స్ డే, మత్తు వదిలితేనే భవిత! -మనకు మిక్కిలి హాని కలిగించే కొన్ని మత్తు పదా ర్థాలను మాదకద్రవ్యాలు (డ్రగ్స్) అని వ్యవహరిస్తారు. ఈనాటి యువతరాన్ని ...యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం -మాదక ద్రవ్యాల వ్యతిరేక




అవగాహన కార్యక్రమం. ఏపీ ప్రభుత్వ డ్రగ్ కమిషన్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం 2026: శక్తివంతమైన ప్రపంచ అవగాహన కార్యక్రమాలను ప్రతి సంవత్సరం జూన్-26 న ప్రపంచం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పాటిస్తుందనీ అన్నారు. దీని అధికారిక నామం మాదక ద్రవ్య దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం 2026 మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం, లేదా ప్రపంచ మాదక ద్రవ్యాల దినోత్సవాన్ని, మాదక ద్రవ్యాల దుర్వినియోగం
యువతపై మద్యం, మాదక ద్రవ్యాల ప్రభావం శారీరకంగా, మానసికంగా మరియు సామాజికంగా తీవ్ర స్థాయిలో ఉంటుందన్నారు. ఇది మెదడు అభివృద్ధిని దెబ్బతీసి, ఏకాగ్రత లోపం, నిర్ణయాలు తీసుకునే శక్తిని కోల్పోయేలా చేస్తుందన్నారు. చెడు స్నేహాలు, ఒత్తిడి, ఆందోళనల వల్ల మత్తు పదార్థాలకు అలవాటు పడే అవకాశం ఉంది. వీటి దుష్ప్రభావాల వివరాలు ఇలా ఉన్నాయి:మానసిక సమస్యలు: నిరాశ (డిప్రెషన్), ఆందోళన, మరియు జ్ఞాపకశక్తి తగ్గిపోవడం వంటి సమస్యలు వస్తాయన్నారు. మత్తుకు బానిస కావడం వల్ల భావోద్వేగాలను నియంత్రించుకోలేరు. శారీరక నష్టం యుక్త వయస్సులో శరీర అవయవాలు ఎదుగుదల దశలో ఉంటాయన్నారు. మద్యం, డ్రగ్స్ వాడకం వల్ల కాలేయం (లివర్), గుండె, ఊపిరితిత్తులు మరియు నాడీ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటాయి అన్నారు . ప్రవర్తనలో మార్పులు చదువుపై ఆసక్తి తగ్గడం, కుటుంబ సభ్యులతో దూరం కావడం, మరియు ఆత్మవిశ్వాసం లోపించడం జరుగుతుందన్నారు. కొన్ని సందర్భాల్లో నేర ప్రవృత్తికి కూడా దారితీయవచ్చు. భవిష్యత్తు నాశనం: యుక్త వయస్సులోనే మత్తు పదార్థాలకు అలవాటు పడటం ద్వారా వారి బంగారు భవిష్యత్తు, కెరీర్ దెబ్బతింటాయన్నారు. చట్టపరమైన చిక్కుల్లో పడే ప్రమాదం కూడా ఉందనీ అన్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ సమస్యను పరిష్కరించడానికి విద్యార్థులకు, యువతకు సరైన అవగాహన కల్పించడం అవసరం. మద్యం మరియు మాదకద్రవ్యాల నివారణకు తీసుకోవాల్సిన నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల ఉచ్చులో పడొద్దు అని అన్నారు. ఈ సందర్భంగా జాతీయ బీసీల కార్యదర్శి డాక్టర్ బత్తుల.సంజీవరాయుడు మాట్లాడుతూ చెడు స్నేహాల వల్ల లేదా పరిస్థితుల ప్రభావంతో తాత్కాలిక ఆనందం కోసం గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడటం అంటే మద్యం మరియు మాదకద్రవ్యాల వాడకం - కొకైన్ లేదా క్రిస్టల్ మెథాంఫేటమిన్ వంటి కొన్ని మత్తుపదార్థాలను వాడటం వలన కలిగే నిర్జలీకరణం, అలసట మరియు చర్మపు చికాకు, మీకు ఇన్ఫెక్షన్లు సోకడాన్ని సులభతరం చేస్తుందన్నారు.
ఈ కార్యక్రమంలో నంద్యాలలోని స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు సురేష్ , అరుణ, లక్ష్మీదేవి, శివరామిరెడ్డి, బర్నబాసు, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.